www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 28 ఫిబ్రవరి 2023



బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులు ఆందోళన చెందొద్దు

జంగారెడ్డిగూడెం : స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియాశాఖపై సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం అవాస్తవమని బ్రాంచి మేనేజర్ కరుణకుమార్ అన్నారు. సోమవారం స్థానిక బాంక్ అఫ్ ఇండియా వద్ద కరుణకుమార్ విలేకరులతో మాట్లాడారు. ఖాతాదారులకు ఏలాంటి నష్టమూ జరగదన్నారు. జంగారెడ్డిగూడెం బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో నకిలీ బంగారంతో రుణాలు పొందడంపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఇతర బ్యాంకుల్లో మాదిరిగా జంగారెడ్డిగూడెం బ్రాంచిలో కూడా ఆడిట్లు, వార్షిక తనిఖీలు జరుగుతున్నాయని బ్రాంచ్ మేనేజర్ తెలిపారు. ఈ నేపథ్యంలో గోల్డ్ ఇన్స్పెక్షన్లో భాగంగా తనఖా పెట్టుకున్న కొన్ని పాకెట్లలో రోల్డ్ గోల్డ్ వస్తువులు గుర్తించామని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధి కారులకు తెలియజేశామన్నారు. ఉన్నతాధికారుల సూచనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోల్డ్గోల్డ్తో రుణాలు పొందిన వ్యక్తితో పాటు మరో అప్రైజర్పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందని కరుణ కుమార్ తెలిపారు.

ఇల్లు కట్టకుంటే పట్టా రద్దు..!

- లబ్ధిదారులపై తీవ్రమైన ఒత్తిడి
- ప్రభుత్వ సాయం కేవలం రూ.లక్షా 80 వేలే
- ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.8 లక్షలుపైనే
- అధికారుల ఒత్తిడితో ఆందోళనలో లబ్ధిదారులు
- ప్రభుత్వ తీరుపై జనంలో తీవ్ర ఆగ్రహం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇళ్ల స్థలాల లబ్ధిదారులపై అధికారులు తీవ్రమైన ఒత్తిడికి దిగారు. ఇల్లు కట్టకుంటే పట్టా రద్దు చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతోపాటు పలుచోట్ల నోటీసులు సైతం జారీ చేస్తున్నారు. దీంతో అప్పు చేసి ఇల్లు కట్టలేక, ఉన్న స్థలం పోతుందేమోనని భయం లబ్ధిదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆర్థిక స్తోమత గురించి ఆలోచించకుండా ఇల్లు కట్టాలంటూ ఒత్తిడి తేవడంపై లబ్ధిదారుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1800 లేఅవుట్లలో 2.50 లక్షల ఇళ్ల పట్టాలను ప్రభుత్వం మంజూరు చేసింది. తొలివిడతగా 1,109 లేఅవుట్లలో 1.42 లక్షల ఇళ్లు నిర్మించాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. జిల్లాల విభజన జరిగిన తర్వాత ఏలూరు జిల్లాలో తొలివిడతగా 1.03 లక్షల ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఇక్కడి అధికారులు ముందుకు సాగుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ తొలివిడతగా దాదాపు 72 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ 14 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇళ్ల నిర్మాణం లక్ష్యం మేరకు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. వచ్చే ఉగాది నాటికి పెద్దఎత్తున గృహప్రవేశాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఇళ్ల నిర్మాణంపై అధికారులు తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారు. ఇంటి నిర్మాణం చేయకుంటే పట్టా రద్దు చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో లబ్ధిదారుల నుంచి తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. దీనికి కారణం ఇల్లు నిర్మించుకునే పరిస్థితుల్లో లబ్ధిదారులు లేకపోవడమే. ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు భరించే స్థితి 90 శాతానికిపైగా లబ్ధిదారులకు లేదు. దీంతో ఇంటి నిర్మాణం పేరు చెబితే భయపడే పరిస్థితి నెలకొంది. నిర్మాణానికి అయ్యే ఖర్చుకు, ప్రభుత్వం ఇచ్చే సాయానికి పొంతన లేకుండాపోయింది. దీంతో ఏ విధంగా ఇల్లు నిర్మించాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

పునాదులకే చాలని ప్రభుత్వ సాయం

ఇంటి నిర్మాణం చేయాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువగా లెక్కించినా రూ.ఎనిమిది లక్షలపైనే ఖర్చవుతోంది. అయితే ప్రభుత్వం ఇచ్చే రుణం సాయం కేవలం రూ.లక్షా 80 వేలు మాత్రమే. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము పునాదుల దశకు కూడా చాలడం లేదు. ఇంకా దాదాపు రూ.ఆరు లక్షలు అప్పు చేస్తే తప్ప ఇల్లు పూర్తికాని పరిస్థితి ఉంది. ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు అంత పెద్దమొత్తంలో అప్పు పుట్టే పరిస్థితి లేదు. దీంతో ఇళ్ల నిర్మాణానికి పెద్దగా ముందుకు రావడం లేదు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటికీ నామమాత్రంగానే నిర్మాణాలు జరగడమే దీనికి నిదర్శనం. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే ఇసుకు ఖర్చు రూ.లక్ష వరకూ అవుతోంది. తాపీ పని వారికి, కూలీలకు రూ.లక్షా 80 వేలు, దాదాపు 200 సిమెంట్ బస్తాలకు రూ.80 వేలు, ఇసుక 40 టన్నులకు రూ.65 వేలు, ఇటుకకు రూ.90 వేలు, మెటల్కు రూ.35 వేలు, సెంట్రింగ్కు రూ.22 వేలు, విద్యుత్, ప్లంబింగ్ పనులకు రూ.50 వేలు, టైల్స్, గుమ్మాలు, కిటికీలు వంటి ఖర్చులకు రూ.లక్షపైనే అవుతోంది. ఇంకా ఇతర ఖర్చులు ఉంటాయి. ఇంత పెద్దమొత్తంలో ఖర్చు చేసే స్తోమత లబ్ధిదారులకు లేకపోవడంతో ఇంటి నిర్మాణానికి జంకుతున్నారు. అధికారులు తీవ్రమైన ఒత్తిడి తెస్తుండటంతో లబ్ధిదారులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీంతో నోటీసులిచ్చినా, పట్టాలు తీసుకున్నా ఇంటి నిర్మాణం చేయలేమని పలుచోట్ల లబ్ధిదారులు ఖరాఖండిగా చెబుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం అందించే సాయం పెంచితే ఇంటి నిర్మాణాలపై లబ్ధిదారులు ముందుకొచ్చే పరిస్థితి ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎంఎల్సి పోరు షురూ


- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- బెడిసికొట్టిన వైసిపి ఏకగ్రీవ యత్నాలు
- ఇద్దరు వైసిపి, నలుగురు స్వతంత్ర అభ్యర్థులు
- 13న ఎన్నికలు
- ఐదుచోట్ల పోలింగ్ కేంద్రాలు
- ఓటు వేయనున్న 1,105 మంది

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక సంస్థల ఎంఎల్సి ఎన్నికల్లో వైసిపి వ్యూహం బెడిసికొట్టింది. ఏకగ్రీవంగా రెండు ఎంఎల్సి స్థానాలను చేజిక్కించుకోవాలనుకుని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. రెండు ఎంఎల్సి స్థానాలకు ఆరుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో వైసిపి అభ్యర్థులుగా వంకా రవీంద్ర, జెడ్పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ నిలవగా, స్వతంత్ర అభ్యర్థులుగా వీరవాసరం మండలానికి చెందిన మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్, కామవరపుకోట మండలానికి చెందిన గోరింక దాసు, పెదవేగి మండలానికి చెందిన దేవరపల్లి ఆదాం, పెంటపాడుకు చెందిన పసల వెంకటాచలం బరిలో నిలిచారు. దీంతో ఎంఎల్సి ఎన్నికలు అనివార్యమయ్యాయి. మార్చి 13న ఎంఎల్సి ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఎన్నికల్లో జెడ్పిటిసి, ఎంపిటిసి, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంఎల్ఎలు, ఎంపిలు ఓటు వేయనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,105 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం ఓట్లలో దాదాపు 881 మంది వైసిపి ప్రజాప్రతినిధులు ఉండగా, 224 మంది టిడిపి, జనసేన ప్రజాప్రతినిధులు ఉన్నారు.

స్వతంత్ర అభ్యర్థులకు టిడిపి అండ

ఎంఎల్సి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా నిలిచినవారంతా టిడిపి సానుభూతిపరులు ఉన్నారు. వీరిలో వీరవల్లి చంద్రశేఖర్ భార్య ప్రస్తుతం వీరవాసరం ఎంపిపిగా ఉన్నారు. ఆయనకు నిమ్మల రామా నాయుడు అండ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. దెందులూరు నియోజకవర్గానికి చెందిన గోరింక దాసుకు చింతమనేని అండ ఉన్నట్లు చెబుతున్నారు. ఎంఎల్సి ఎన్నికల్లో ఒక వ్యూహం ప్రకారం తమ నాయకులను స్వతంత్ర అభ్యర్థులుగా టిడిపి బరిలోకి దింపినట్లు తెలుస్తోంది. ఎంపిటిసిల ఛాంబర్ పరోక్షంగా వీరికి అండగా నిలవనున్నట్లు ప్రచారం సాగుతోంది.



కవురు శ్రీనివాస్ వంకా రవీంద్రనాథ్ వీరవల్లి చంద్రశేఖర్ దాసు చలం ఆదాము

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో అత్యధికంగా బిసిలు ఉన్నారు. దీంతో వైసిపి అభ్యర్థిగా బిసి సామాజిక తరగతికి చెందిన కవురు శ్రీనివాస్ను బరిలో దింపారు. అదే సామాజిక తరగతికి చెందిన వీరవల్లి చంద్రశేఖర్ పోటీలో ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎంఎల్సి ఎన్నికల్లో మొదటి, ద్వితీయ, తృతీయ ప్రాధాన్యత ఓటు ఆధారంగా ఎన్నికలు జరుగుతాయి. దీంతో మొదటి ప్రాధాన్యత ఓటు వైసిపి అభ్యర్థికి వేసి, రెండో ప్రాధాన్యత ఓటు స్వతంత్ర అభ్యర్థికి వేస్తే ఒక ఎంఎల్సి స్థానం గెలుచుకునే అవకాశం ఉందనే వ్యూహంతో టిడిపి తమ వారిని స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలిపినట్లు తెలుస్తోంది. ఎంఎల్సి ఎన్నికలు అనివార్యం కావడంతో వైసిపి అభ్యర్థుల్లో కొంత గుబులు నెలకొంది.

ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ఎంఎల్సి ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఐదుచోట్ల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 249 మంది ఓటు వేయనున్నారు. జంగారెడ్డిగూడెం ఎంపిడిఒ కార్యాలయ కేంద్రంలో 184 మంది, కొవ్వూరు ఎంపిడిఒ కార్యాలయ కేంద్రంలో 242, నరసాపురం ఎంపిడిఒ కార్యాలయ కేంద్రంలో 229 మంది, భీమవరం ఎంపిడిఒ కార్యాలయ పోలింగ్ కేంద్రంలో 201 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ జరగనుంది. 16వ తేదీన కౌంటింగ్ జరగనుంది.

నోట్: కిందిమేటర్ను బాక్స్లో పెట్టగలరు

చివరిరోజు ఒక నామినేషన్ విత్డ్రా

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్సి ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజైన సోమవారం స్వతంత్ర అభ్యర్థి వంకా రాజకుమారి తన నామినేషన్ను ఉపసంహరించుకున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు 15 నామినేషన్లను దాఖలు చేయగా వారిలో స్వతంత్ర అభ్యర్థి నల్లి రాజేష్ నామినేషన్ నిబంధనల మేరకు లేకపోవడంతో తిరస్కరించారు. మరో స్వతంత్ర అభ్యర్థి వంకా రాజకుమారి నామినేషన్ను ఉపసంహరించుకోవడంతో ఆరుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.

ప్రీతి మృతికి కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

తెలంగాణ రాష్ట్రం వరంగల్లో గిరిజన విద్యార్థి ప్రీతి ఆత్మహత్యకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గుగ్గులోతు కృష్ణనాయక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోడా బాలా నాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులు ఇప్పుడిప్పుడే ఉన్నతవిద్యలో రాణిస్తున్నారని, ఈ తరుణంలో ప్రీతి మృతి బాధాకరమన్నారు. సీనియర్ వైద్యవిద్యార్థి సైఫ్ వేధిస్తున్నాడని పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రిన్సిపల్, హెచ్ఒడిలు పట్టించుకోలేదన్నారు. దీనికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిబాధ్యత వహించాలన్నారు.

చింతలపూడి : ప్రీతి ఆత్మహత్యకు కారకులను శిక్షించాలని కోరుతూ చింతలపూడి పట్టణంలో లంబాడి హక్కుల పోరాట సమితి అధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబబు, నాయకులు బాణావతు గొపాలకృష్ణ, నాగేశ్వరావు పాల్గొన్నారు.

అడవుల అభివృద్ధికి సహకరించాలి

జీలుగుమిల్లి: అడవుల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా అటవీ అభివృద్ధి అధికారి రవీంద్రధామ తెలిపారు. సోమవారం మండలంలోని దర్భగూడెం బీట్ పరిధిలోని కొత్తపండువారిగూడెం అటవీ ప్రాంతంలోని 20 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 50 ఎకరాల్లో జరుగుతున్న వెదురు (బ్యాంబో) కటింగ్ను పరిశీలించారు. అనంతరం ప్లాంటేషన్లో లోడింగ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిగా తయారైన, నాణ్యమైన వెదురు కర్రనే కటింగ్ చేసి రవాణా చేసి టింబర్ డిపోకు తరలించాలని సూచించారు. అటవీ శాఖ విస్తీర్ణాన్ని పెంచి అటవీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని నర్సరీ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు సబ్ డివిజనల్ అటవీ శాఖ అధికారి పుష్ప సౌజన్య, రేంజ్ అధికారి శ్రీవాణి, బుట్టాయగూడెం డిఎఫ్ఒ, బీట్ అధికారి లలిత ఉన్నారు.

నేడు కొల్లేరులో పక్షుల సర్వే

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

లక్షలాది పక్షులకు విడిది కేంద్రమైన కొల్లేరులో ఈ నెల 28న పక్షుల సర్వే జరుపనున్నారు. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ ఆధ్వర్యంలో ఈ సర్వే జరగనుంది. సొసైటీకి చెందిన ఇద్దరు నిపుణులు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నారు. ఇదే అంశంపై సోమవారం ఏలూరు రేంజ్ కార్యాలయంలో సిబ్బందితో రేంజర్ కుమార్ సమావేశం నిర్వహించారు. కొల్లేరు పరిధిలోని ఏలూరు, కైకలూరు, అవనిగడ్డ రేంజ్ల పరిధిలో పక్షుల గణన నిర్వహించనున్నారు.

గ్రామదేవత ఉత్సవాల్లో చిచ్చుపెట్టొద్దు

జీలుగుమిల్లి: జిల్లా కేంద్రం జీలుగుమిల్లిలో ఈనెల 26 నుంచి జరుగుతున్న జగదాంబ వార్షిక ఉత్సవాల్లో సంస్కృతీ, సాంప్రదాయాల పేరుతో ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్ చిచ్చు పెట్టాలని చూస్తే సహించేది లేదని ఎపి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు హెచ్చరించారు. సోమవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు గత 60 ఏళ్లుగా ప్రశాంత వాతావరణంలో, ప్రత్యేకపూజలతో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కానీ వాటికి భంగం కలిగిస్తున్నట్లు అర్ఎస్ఎస్ చెప్పడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలకు భిన్నంగా దేవాలయాలపై అగ్రకుల పెత్తందారులే ఛైర్మన్గా కొనసాగుతుంటే నోరుమెదపని వారు, సంసకృతి, సాంప్రదాయాలకు నష్టం జరిగిపోతున్నట్లు ఆందోళన చేయాలని చూడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా ఆర్ఎస్ఎస్ కుట్రలో ఒక భాగమని ఆయన విమర్శించారు. ఏజెన్సీలో ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్ కుట్రలు సాగవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి గుజ్జు నాగేంద్ర, సభ్యులు కల్లూరు దావీదు, నారం మల్లేష్, జయమ్మ, పండు, చంద్రమ్మ,ఉన్నారు.

అంతర్రాష్ట్ర హ్యాండ్బాల్ పోటీల ఛాంపియన్ పశ్చిమ

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని వేగవరం హేలాపురి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఎనిమిదో అంతర్ జిల్లాల సీనియర్ మహిళల హ్యాండ్బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. మొత్తం పది జట్లు వివిధ జిల్లాల నుంచి పాల్గొన్నాయి. ఈ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు విజయం సాధించింది. రెండోస్థానంలో ప్రకాశం జిల్లా జట్టు, ఆ తర్వాత విశాఖపట్నం జట్టు నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ తెలిపారు. విజేతలకు అక్షర స్కూల్ కరస్పాండెంట్ పాలడుగు అర్చనా చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా హ్యాండ్బాల్ అసోసియేషన్ సెక్రటరీ అలివేలు మంగ, ఎఒ కరుణానిధి, మేనేజర్ ఎం.ప్రసన్న, పశ్చిమ గోదావరి జిల్లా హ్యాండ్బాల్ కోచ్ ఉదయ్, సీనియర్ హ్యాండ్బాల్ ప్లేయర్ భూపతి పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

మాతా, శిశు మరణాల కట్టడికి చర్యలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా, వీటి కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖాధికారులపై ఉందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో మాతా, శిశు మరణాలపై కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాతా, శిశు మరణాలపై సమీక్ష జరిపి మాతృ మరణాలకు దారితీసిన కారణాలపై సంబంధిత వైద్యాధికారుల నివేదికలను పరిశీలించారు. మాతా శిశు మరణాలు సంభవించకుండా ప్రతి ఒక్కరూ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణులకు చికిత్స విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని ముఖ్యంగా మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేవరకూ అన్ని పరీక్షలతో పాటు వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు ఆరోగ్య విషయాలను తెలియజేయాలన్నారు. ఇదే సమయంలో వారి ఆరోగ్యస్థితిని కూడా ఎప్పుడూ గమనిస్తూ ఉండాలన్నారు. ఈ విషయంలో వైద్యాధికారి నుంచి ఎఎన్ఎం, ఆశా, తదితర సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉంటే మాతా, శిశు మరణాలు సంభవించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో గర్భిణుల్లో సాధారణంగా కనిపించే రక్తహీనత, అధిక రక్తపోటు సమస్యలను త్వరగా గుర్తించి తగు సూచనలను సంబంధిత వైద్యాధికారులు ఎప్పటికప్పుడు అందించడం ద్వారా మరణాలను అరికట్టొచ్చన్నారు. వైద్య సిబ్బంది గర్భిణులకు, బాలింతలకు అందించే సేవల్లో ఖచ్చితత్వాన్ని ప్రదర్శిస్తే మాతా, శిశు మరణాలను నిలువరించవచ్చని చెప్పారు. గర్భందాల్చిన మహిళ పుట్టింటికి వెళ్లిన సమయంలో కూడా ఆమె ఆరోగ్య పరిస్థితిని ఎఎన్ఎంలు పరిశీలించాలన్నారు. హైరిస్కు కేసులు ముందస్తుగా గుర్తించి ప్రత్యేకదృష్టిసారించాలని ముఖ్యంగా రాత్రి సమయంలో మరణాలు సంభవించకుండా నిరంతర పర్యవేక్షణ ఉంచాలన్నారు. హై రిస్కు కేసుల్లో గర్భందాల్చిన మహిళలకు 34వ వారం నుంచి ప్రతీవారం వైద్యపరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన రీతిలో ఎంఎల్హెచ్పిలకు శిక్షణ అందించాలన్నారు. మాతా శిశు మరణాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, అనుసరించాల్సిన పద్ధతులపై కొత్తగా వచ్చిన జూనియర్ డాక్టర్లకు సీనియర్ డాక్టర్లతో సమగ్ర శిక్షణ అందించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి.ఆశ, డిఐఒ నాగేశ్వరరావు, ఆర్ఎంఒ పి.శ్రీనివాసరావు, గైనకాలజిస్ట్ పద్మ పాల్గొన్నారు.

27న గిరిజన సంఘం బహిరంగ సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వచ్చేనెల 27న జీలుగుమిల్లిలో జరిగే గిరిజన సంఘం జిల్లాస్థాయి బహిరంగసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పడమటి రేగులకుంట గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బహిరంగసభ ప్రచార గోడపత్రికలను విడుదల చేశారు. సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొవ్వాసి దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెల్లం రామకృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మండలంలో తుపాకుల ఫ్యాక్టరీ నిర్మాణానికి సర్వేలు నిర్వహిస్తుందని, ఇది పూర్తిగా గిరిజన చట్టాలకు విరుద్ధమన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అదానీకి గిరిజన భూమి కట్టబెట్టేందుకే ఈ ప్రయత్నాలు చేస్తున్నాయని, దీనిని గిరిజన సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ తుపాకుల ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. గిరిజనుల సాగులో ఉన్న పోడుభూములకు పట్టాలిస్తామని ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ చెప్పినప్పటికీ నేటికీ పట్టాలు ఇవ్వలేదన్నారు. గిరిజనుల సాగులో ఉన్న ఎల్టిఆర్, 1/70 చట్ట భూములకు కూడా సాగులో నమోదు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. నిర్వాసితుల పునరావాస కాలనీల్లో కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, శ్మశానవాటికలు లేక నిర్వాసితులు నానాఅవస్థలు పడుతున్నారని తెలిపారు. నిర్వాసితులకు ఇవ్వాల్సిన పునరావాస ప్యాకేజీ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చోడెం దుర్గారావు, భద్రం, తెల్లం ప్రసాద్, నూపా చంద్రరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జూన్ నాటికి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జూన్ నాటికి జగనన్న ఇళ్లు గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని, లక్ష్యాలను నూరుశాతం పూర్తిచేసేందుకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం జగనన్న ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై హౌసింగ్ అధికారులు, ఇంజినీర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులకు 89 వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా, ఇప్పటివరకూ అనుకున్న రీతిలో ఇళ్ల నిర్మాణ ప్రగతి లేకపోవడం కలెక్టర్ అధికారుల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇళ్లు జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి చూపించాల్సిందేనని, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంలో అలసత్వంవహించే అధికారులు ప్రభుత్వం తీసుకునే క్రమశిక్షణా చర్యలకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. ఉగాది నాటికి 25 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని, నూరుశాతం ఇళ్ల నిర్మాణాల ప్రగతికి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని, ఏ రోజు ప్రగతిని అదే రోజు పూర్తిచేసేలా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులైన డ్వాక్రా మహిళలకు రూ.35 వేలు అదనపు రుణంగా మంజూరు చేస్తున్నారని, అదనపు రుణం తీసుకుని నిర్మాణ పనులు ప్రారంభించని వారి నుండి ఆ రుణం రికవరీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్బాబు, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జెడ్పి సిఇఒ కె.రవికుమార్, డిఆర్డిఒ పీడీ విజయరాజు, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ అధికారి వేణుగోపాల్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

డిసిసిబిలో అవకతవకలపై విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

డిసిసిబిల్లో(జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) అవకతవకలపై ఉన్నతాధికారులతో విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని, ప్రజల సొమ్మును రికవరీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. డిసిసిబి బ్యాంకుల్లో రూ.150 కోట్లు స్వాహ అయినట్లు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భారీస్థాయిలో బ్యాంక్ గోల్మాల్ జరిగినట్లు పత్రికల్లో వస్తున్న వార్తలు ఖాతాదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయన్నారు. ఆ సొమ్ము అంతా ఏమైందని, ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న బ్యాంకుల్లోనే ఇంత అవినీతి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఎంతమేర ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలానే కొనసాగితే త్వరలో డిసిసిబి బ్యాంక్ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. వెంటనే ఈ ఘటనలపై ఉన్నతాధికారులతో, జిల్లా కలెక్టర్తో విచారణ చేయించాలని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదంతా ప్రజల సొమ్ము కాదా అని ప్రశ్నించారు. గోల్మాల్కు గురైన ప్రజల డబ్బు రికవరీ చేయాలని రవి డిమాండ్ చేశారు. కామవరపుకోట, పెనుగొండ డిసిసిబి బ్యాంక్లో చేతివాటం చూపించారనే వార్తలు వస్తున్నాయన్నారు. చాగల్లు బ్రాంచ్లో నకిలీ బంగారంపై అప్పుల కుభకోణం జరిగిందని తెలిపారు. పదేళ్ల క్రితం చాగల్లు సుగర్ ఫ్యాక్టరీకి ఇచ్చిన అప్పు రూ.10 కోట్లు అని, అది వడ్డీతో ఇప్పుడు దాదాపు రూ.30 కోట్లు అయిందని, దీన్ని ఎవరు తీరుస్తారని, ఎవరు వసూలు చేస్తారని ప్రశ్నించారు. సిఇఒ శ్రీదేవి పెనుగొండ నోడల్ ఆఫీసర్గా ఉన్నప్పుడు రూ.30 కోట్లు స్వాహా జరిగిందనే దానిపై విచారణ చేపట్టి ఏడాది గడిచినా దాని పురోగతి ఏమిటో తెలియదన్నారు. యలమంచిలి, కొవ్వూరు, ఇంకా కొన్ని బ్రాంచి బ్యాంకుల్లో బ్యాంకు గ్యారంటీల పేరుతో ఎలాంటి హామీలు లేకుండా రూ.30 కోట్లు అప్పులు ఇచ్చారని, ఇప్పటికీ రూపాయి కూడా దానిపై వసూలు చేయలేదని, దీనికి బ్యాంక్ ఉన్నతాధికారులు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అప్కాబ్ నిబంధనకు విరుద్ధంగా ప్రస్తుత పాలకవర్గం ఇచ్చిన ఒటిఎస్లు ప్రస్తుత సిఇఒ సన్నిహితులు, ఎంత మంది సిఇఒకు సంబంధించిన వాళ్లు ఎన్ని కోట్ల రూపాయల లబ్ధిపొందారో, ఈ అవినీతిలో సిఇఒ వాటా ఎంతో అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ అవినీతి కుంభకోణంపై ప్రస్తుత డిసిఒ, కలెక్టర్ దర్యాప్తు వేగవంతం చేస్తే మరిన్ని ఆసక్తికరమైన సంఘటనలు, విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. ఉన్నతాధికారులు ఈ ఘటనలపై స్పందించి, చర్యలు చేపట్టి, అవినీతి కుంభకోనానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, డిసిసిబి బ్యాంకుని బతికించాలని కోరారు.

విద్యార్థులు డ్రగ్స్బారిన పడొద్దు

ప్రజాశక్తి - భీమడోలు



మాట్లాడుతున్న రాజేశ్వరి

విద్యార్థులు డ్రగ్స్కు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి కోరారు. భీమడోలు హైస్కూల్లో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి భీమడోలు బార్ అసోషియేషన్ అధ్యక్షులు విజయరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాజేశ్వరి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం పలు చట్టాలు చేసిందన్నారు. విద్యార్థులకు మంచి స్పర్శ, చెడుస్పర్శ మధ్య గల తేడాలను వివరించారు. బాలలు ఎవరికైనా ఇబ్బంది కలిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణ సందర్భంగా బాలలకు ఏర్పాటు చేసే రక్షణ, విచారణ తీరు, కొన్ని అంశాల నుంచి వారికి ఇచ్చే మినహాయింపులను వివరించారు. ఈ నేపథ్యంలో మాదక దవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటి పరిణామాల గురించి వివరించారు. విద్యార్థుల హక్కుల. గురించి తెలిపారు. లైంగిక వేధింపులు, ఇతర అంశాల సందర్భంగా చట్టం నుండి రక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు విజయరాజు, విద్యార్థులు చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సిఐ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

నూజివీడు రూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కౌలురైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏలూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఎన్ నరసింహ కోరారు. గత శనివారం ముసునూరు మండలం చింతలపల్లిలో ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగుచేసి నాసిరకం విత్తనాల వల్ల నష్టపోయి తీవ్ర మనస్థాపానికి గురైన రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడ్డు. నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్రావును రైతు సంఘం నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు . నాసిరకం విత్తనాలను అందజేసిన సంబంధిత ఆర్గనైజర్లు , కంపెనీని అధికారులపై చర్యలు తీసుకుని రైతు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు . అంతకుముందు నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ కు రైతు సంఘం నాయకులు రైతు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గంటా పాపారావు పాల్గొన్నారు.

మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ ఏర్పాటు

ఏలూరు: జిల్లాలో వచ్చేనెల 13వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల ప్రకారం జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ (ఎంసిఎంసి) కమిటీని ఏర్పాటు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెసి పి.అరుణ్బాబు ఛైర్మన్గా, ఎఆర్ఒ, జిల్లా రెవెన్యూ అధికారి మూర్తి నోడల్ అధికారిగా, డిఐఒ జివిఎస్ఆర్.శర్మ, సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ ఇన్ఫర్మేషన్, బ్రాడ్ కాస్టింగ్కు చెందిన కె.శ్రీరామ్మూర్తి, దూరదర్శన్, ఎఐఆర్ కరస్పాండెంట్ ఐ.సుబ్బారావు సభ్యులుగాను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.భవాని సెక్రటరీగా ఉన్నారు. వీరు ప్రతిరోజు ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలను నిరంతరం పరిశీలించి ప్రకటనలు, చెల్లింపు వార్తలు గుర్తించి సంబంధిత పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల ఖర్చు కింద చూపుతారు. ఎవరైనా అభ్యర్థులు గానీ, వారి తరపున వ్యక్తులు గాని ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు జారీ చేస్తే అందుకు సంబంధించిన ప్రకటనలు మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీకి అందజేసి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుంది. ముందస్తు అనుమతి కోసం ఏలూరు కలెక్టరేట్లోని ఎలక్షన్సెల్లో ఏర్పాటు చేసిన ఎంసిఎంసి కమిటీని సంప్రదించాల్సి ఉంటుంది. అలాగే పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున ప్రింట్ మీడియాలో ప్రకటనలు ప్రచురించే ముందు ధృవీకరణ తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది.

రోడ్డు నిర్మించాలని ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని మెత్తిమెల్లివారిగూడెం నుంచి ఊటసముద్రం వరకు రోడ్డు నిర్మించాలని మెత్తిమెల్లివారిగూడెం గ్రామస్తులు ఊటసముద్రం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెత్తిమెల్లివారిగూడెం నుంచి ఊటసముద్రం వరకు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా ఉందని, ద్విచక్రవాహనదారులు కూడా ఆ రోడ్డులో ప్రయాణించలేకపోతున్నారని చెప్పారు. గర్భిణులు, విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులు పొలాలకు వెళ్లాలన్నా, అనారోగ్యానికి గురైనవారిని ఆసుపత్రికి తరలించాలన్నా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రాణప్రాయస్థితిలో ఈ రోడ్డుపై ప్రయాణిస్తే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సమస్యపై ఎంపీ, ఎంఎల్ఎ, సర్పంచి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని వాపోయారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రోడ్డును నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేశ్వరరావు, వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, నాగ శ్రీనివాసరావు, రవి పాల్గొన్నారు.

పొలసానిపల్లిలో అన్న సమారాధన

ప్రజాశక్తి - భీమడోలు



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న సర్పంచి

పొలసానిపల్లిలోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో (శివా లయంలో) పూర్తయిన మహాశివరాత్రి కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచి షేక్ రహీమా బేగం హసేన ప్రారంభించారు తొలుత సర్పంచి దంపతులు షేక్ రహీమా బేగం, షేక్ హసేన దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు హామీ ఇచ్చారు. అన్న సమారాధన కార్యక్రమానికి స్టీరింగ్ కమిటీ సభ్యులు కోట శంకరం, కోట దుర్గారావు, చిలపర్తి ఆదినారాయణ, మంచెం నాగు, కె.రుక్మాంధరరావు, పి.లక్ష్మీనారాయణ, అంబటి దేవి నాగేంద్రప్రసాద్ సహకారాన్ని అందించారు.

చేపల చెరువు తవ్వకం నిలిపి వేయాలని వినతి

ప్రజాశక్తి - కలిదిండి



తహాశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మహేష్

మండలంలోని సానా రుద్రవరం హరిజనవాడకు ఆనుకుని చేపల చెరువు తవ్వకం పనులను నిలిపివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జక్కుల మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహాశీల్దార్ తేజోమణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జక్కుల మహేష్ మాట్లాడుతూ హరిజనవాడకు ఆనుకుని చేపల చెరువు తవ్వకం చేపట్టడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నార న్నారు. ఇళ్ల పక్కనే ఉన్న వ్యవసాయ భూమి చేపల చెరువుగా మారితే గ్రామంలోకి మురుగు నీరు చేరి ముంపునకు గురవుతామని భయాందోళన చెందుతు న్నారన్నారు. అంతేకాకుండా గ్రామస్తులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. సుమారు ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమిని చేపల చెరువుగా తవ్వేందుకు పనులు చేపట్టారన్నారు. విచారణ చేసి ఈ తవ్వకం పనులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్‌తో పాటు గ్రామస్తులు మారుపూడి కుమార్, దాసరి సురేష్, కిషోర్, వినోద్, చింతల దాసు, అశోక్, బంగార్రాజు, డి.ప్రతాప్, బి.దావీదు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పీచు పరిశ్రమలో అగ్ని ప్రమాదం

రూ.50 వేల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - పెదవేగి

మండలంలోని విజయరాయి గాంధీనగర్‌లో కొబ్బరి పీచు పరిశ్రమలో సోమవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. సకాలంలో సిబ్బంది, అగ్నిమాపక శాఖ స్పందించటంతో పెను ప్రమాదం తప్పింది. జిల్లా సహాయక అగ్నిమాపక ఫైర్ ఆఫీసర్ వి.రామకృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం... విజయరాయి గ్రామంలో గాంధీనగర్‌లో వై.తిరుమలరావు అనే వ్యక్తి సుబ్రహ్మణ్యేశ్వర క్వాయర్ ఇండస్ట్రీ నిర్వహిస్తున్నారు. సోమవారం యధావిధిగా సిబ్బంది పని చేస్తుండగా ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కావటంతో మంటలు చెలరేగాయి. వెంటనే సిబ్బందితో మంటలు ఆర్పే ప్రయత్నం చేసి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ ఫైర్ అధికారి వి.రామకృష్ణారావు ఏలూరు నుంచి తమ సిబ్బందితో ఫైర్ ఇంజన్‌తో సహా హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు. అగ్నిమాపక శాఖ సకాలంలో రావడం వల్ల సమారు రూ.11.50 లక్షల మేర ఆస్తిని కాలిపోకుండా కాపాడారు. సకాలంలో అగ్నిమాపక శాఖ స్పందించకపోతే భారీ నష్టాన్ని చవిచూసేవారిమని పరిశ్రమ యజమాని తిరుమలరావు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు గానీ ప్రాణ నష్టం సంభవించలేదు.

లారీ ఢీకొని జట్టుకూలీ మృతి

ప్రజాశక్తి - గణపవరం

లారీ ఢీకొని జట్టు కూలీ మృతి చెందిన ఘటన గణపవరంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గణపవరం సిఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. జట్టుకూలిగా పనిచేస్తున్న గణపవరం గొల్లలదెబ్బకు చెందిన చల్లా వెంకటేశ్వరరావు (60) సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో నిత్యావసర సరుకుల కోసం సైకిల్‌పై గణపవరం వెళ్లాడు. సరుకులు కొనుగోలు చేసి తిరిగి సైకిల్‌పై గొల్లలదెబ్బకు బయలుదేరాడు. ఈ క్రమంలో కుమారి థియేటర్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

టిప్పర్ బోల్తా

మండవల్లి :అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్ అదుపు తప్పి కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. స్థాని కులు తెలి పిన వివరాల ప్రకారం... జాతీయ రహదారి విస్తరణ పనులకు అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్ కొర్లపాడు నుంచి మట్టి లోడుతో వేగం గా వెళ్తూ కొర్లపాడు మలుపు వద్ద అదుపుతప్పి కాలువలో బోల్తా పడింది. ఇది గమనిం చిన స్థానికులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను బయటకు తీశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మక్కినవారిగూడెం పంచాయతీలోని కొల్లివారిగూడెం గ్రామానికి చెందిన వివాహిత ఈ నెల 17వ తేదీన వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం వచ్చిన తరువాత రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించింది. ఈ క్రమంలో రాత్రి 12 గంటలకు భర్త లేచి చూడగా ఇంటిలో ఎక్కడా కనిపించకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. ఎక్కడా ఆచూకీ దొరకకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ఇద్దరు సారా విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పోతనపల్లి గ్రామంలో చిన్నతండాకు చెందిన ధారావత్ శంకర్‌అనే వ్యక్తి వద్ద నుంచి ఎస్‌బిసి సిబ్బంది సోమవారం సాయంత్రం 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనంపై సారాను తరలిస్తుండగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది పట్టుకొని బైకును స్వాధీనం చేసుకొని శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముసునూరు మండలం కొర్లగుంట గ్రామానికి చెందిన పోలగాని మంగయ్య వద్ద నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఇబి సిబ్బంది తెలిపారు.

శాస్త్రీయ అంశాల వెలికితీతకు సైన్స్ ప్రదర్శనలు

ప్రజాశక్తి - మండవల్లి



సైన్స్ నమూనాలను తిలకిస్తున్న డిప్యూటీ తహాశీల్దార్ సుధారాణి

విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ అంశాలను వెలికి తీయడానికి సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని డిప్యూటీ తహాశీల్దార్ ఎం.సుధారాణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుధామ ఫౌండేషన్ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి విద్య వైజ్ఞానిక సైన్స్ ప్రదర్శనలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సైన్స్‌పై అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరం అన్నారు. తద్వారా విద్యార్థులు రానున్న కాలంలో ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఎంత దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా మండవల్లి, లింగాల, కానుకొల్లు, పుట్లచెరువు, ఎంగిలిపాకలంక, లోకముడి, చింతపండు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఏర్పాటుచేసిన 70 పైగా సైన్స్ నమూనాలను తిలకించి ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. భావితరాలకు ఉపయోగపడే ప్రాజెక్టు తయారు చేయడంపై ఆమె విద్యార్థులను అభినందించారు. వారికి సహకరించిన ఉపాధ్యాయులను అభినందించారు. సైన్స్ ప్రదర్శనలను శాస్త్రవేత్త సుధామ ఫౌండేషన్ అధినేత సుధాబత్తుల విజయకుమార్ ప్రారంభించగా ఆయనతో పాటు జూనియర్ లెక్చరర్ కిరణ్‌కుమార్, రిటైర్ ఉపాధ్యాయులు కె.సూర్యరావు పలువురు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మెండ ఝాన్సీ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, అప్పారావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, కె.కృష్ణమోహన్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు, ఉపాధ్యాయులు ఆర్‌విఎల్.నరసింహారావు, కె.శ్యాంప్రసాద్ ,నాగేశ్వరావు, జి.సుబ్బారావు, నాంచారయ్య, కె.రఘురాం, వెంకటేశ్వర్లు, ఎస్.రాధ పాల్గొన్నారు.

ఘనంగా పెద్దింట్లమ్మ జాతర

ప్రజాశక్తి - కైకలూరు

మండలంలోని కొల్లేటికోటలో పెద్దింటి అమ్మవారి దేవస్థానంలో జాతర ఉత్సవాలు సోమవారం ఏడో రోజు ఘనంగా నిర్వహించారు. జలదుర్గ సమేత పెద్దింటి అమ్మవారికి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించి మొక్కుబడులు చెల్లించుకు న్నారు. భుజబలపట్నానికి చెందిన ముదునూరి నాగరాజు, గీత కృష్ణవేణి, పెనుమత్స శ్రీధర్ వర్మ దివ్యలు అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదం వితరణ చేశారు. ఆలయ అర్చకులు విశేష పూజలు జరిపించి, శేష వస్త్రములతో వారిని సత్కరించారు. ఆలయ కార్యనిర్వహణ ాధికారి కెవి.గోపాలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పారావుకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - ఉంగుటూరు

సింహపురి మాయేంద్రజాల్ మ్యాజిక్ ఫెస్టివల్ ఈ నెల 26వ తేదీన నెల్లూరులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనేక రాష్ట్రాల నుంచి పలువురు మేజిషియన్స్ పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం రావులపర్రుకు చెందిన అన్నెపు దేవేంద్ర అప్పారావు కార్యక్రమంలో పాల్గొని తన మ్యాజిక్ ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్ర ముగ్దులను చేశాడు. ప్రదర్శన అనంతరం నిర్వాహకులు దేవేంద్రకు సన్మానంతో పాటు జ్ఞాపికను అందించి అభినందించారు. ఈ సందర్భంగా సొంతూరు వచ్చిన అతన్ని పలువురు సోమవారం అభినందించారు.

చాట్రాయిలో కెడిసిసి బ్యాంకు బ్రాంచ్

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రమైన చాట్రాయిలోని కెడిసిసి బ్యాంకు బ్రాంచ్ నూతన భవన నిర్మాణ పనులకు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.96 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, కెడిసిసి బ్యాంక్ జిల్లా ఛైర్‌పర్సన్ తన్నీరు నాగేశ్వరరావు, గ్రామ సర్పంచి దామెర ఉష, జెడ్‌పిటిసి సభ్యులు చెలికాని అనూష, ఎంపిపి లంక నిర్మల పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మానవత సంస్థ ఉంగుటూరు మండల శాఖ ఆధ్వర్యంలో కైకరం పంచాయతీ పరిధి వెంకటకృష్ణాపురంలో సోమవారం ఆశ్రం ఆసుపత్రి వైద్య సిబ్బందితో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 160 మంది వివిధ వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని మానవత సంస్థ రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపీ ప్రారంభించారు. ఎంపిటిసి సభ్యులు పంతులు వెంకన్నబాబు, మట్టా మురళీ, రవి పాల్గొన్నారు.

చినవెంకన్న ట్రస్టు బోర్డు సభ్యురాలికి సన్మానం

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల పాలకమండలి సభ్యురాలిగా ఇటీవల నియమితురాలైన కాపు సామాజిక తరగతికి చెందిన పెద్దిరెడ్డి పద్మజ్యోతి శ్రీనివాస్‌ను ద్వారకాతిరుమల కాపు కళ్యాణ మండపంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు హాజరయ్యారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వాహన ప్రమాదాల్లో అధికంగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణనష్టం కలుగుతుందని డిఎస్‌పి కెవి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక శంకరీ డిగ్రీ కళాశాలలో హెల్మెట్ వినియోగం అవశ్యకతపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి కెవి.సత్యనారాయణ మాట్లాడుతూ యువత వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ బాలా సురేష్‌బాబు, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, కలశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. సింగన్నగూడెం మెయిన్‌రోడ్డు వద్ద ద్విచక్ర వాహనదారులకు ఆయన రహదారి భద్రత-హెల్మెట్ ధారణపై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలు పాటించడంతో పాటు హెల్మెట్‌ను ధరించడం వల్ల ప్రాణాపాయ నష్టాలను చాలా వరకు నివారించవచ్చని తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కైకలూరు

జగనన్న లే అవుట్‌లో ప్రభుత్వ భవనాలతో పాటు పక్కా గృహ నిర్మాణాలు కూడా వేగవంతం చేయాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. కైకలూరు జగనన్న కాలనీలో పనులను ఆయన సోమవారం పరిశీలించారు. మడకా శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకట కృష్ణమోహన్, గృహనిర్మాణ శాఖ సహాయ ఇంజినీర్ శేఖర్, నాయకులు తోటమహేష్, నాగిరెడ్డి రమేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

ఘనంగా సిలువగట్టు తిరునాళ్లు

ప్రజాశక్తి - నూజివీడు

సిలువగట్టు పుణ్య క్షేత్రం తిరునాళ్లలో భాగంగా ముఖ్య అతిథులుగా విజయవాడ మేత్రాసనం మోన్సిగ్నోర్స్ రెవ ఫాధర్ మువ్వల ప్రసాద్, రెవ ఫాధర్ పల్లిపాము గాబ్రియేల్ పాల్గొన్నారు. విద్యుత్ కాంతులతో, బుర్ర కథలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రైస్తవ పాటల గానకచేరీలతో ఘనంగా తిరునాళ్లు జరుగుతున్నాయి. 28వ తేదీ ముగింపు రోజున విజయవాడ మేత్రాసనం పీఠాధిపతులు డాక్టర్ తెలగతోటి జోసెఫ్ రాజారావు పాల్గొంటారు.

ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో 2023 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ స్థానిక ఆలపాటి గంగాభవాని ఫంక్షన్ హాలులో కామన్ సంజయ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. విద్యుత్ శాఖ డిఇ కెఎం.అంబేద్కర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. రానున్న రోజుల్లో కాంట్రాక్ట్ కార్మికుల హక్కులు సాధించుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌కో డిఇ డిఇ కెఎం.అంబేద్కర్ మాట్లాడుతూ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో ఈ క్యాలెండర్ డైరీ ఆవిష్కరించ డంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు టౌన్ కార్యదర్శి షేక్ సుభాషిని, సిఐటియు టౌన్ అధ్యక్షులు పి.సూర్యరావు, యుఇసిడబ్ల్యుయు జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి చంద్రశేఖరం, డివిజన్ అధ్యక్షులు దొండపాటి నాగేంద్ర, డివిజన్ ప్రధాన కార్యదర్శి బాలిన సత్యనారాయణ, డివిజన్ ఉపాధ్యక్షులు పెనుమత్స బాపిరాజు పాల్గొన్నారు.

కౌలురైతుకు న్యాయం చేస్తాం

నూజివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు విద్యాసాగర్



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నూజివీడు ఎడిఎ

ప్రజాశక్తి - ముసునూరు

మొక్కజొన్న పంటలో కండెలు రాలేదని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కౌలు రైతుకు న్యాయం చేస్తామని, నష్ట పరిహారం వచ్చేలా చూస్తామని నూజివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ చెప్పారు. నూజివీడు మండలానికి చెందిన వేముల వెంకట్రావు ముసునూరు మండలంలోని చింతలవల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో సుమారు 6.34 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో మొక్కజొన్న పంటలో కండెలు రాలేదని మనస్తాపానికి గురైన ఆయన ఇటీవల గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం వెంకట్రావు నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మొక్కజొన్న పంటను పరిశీలించాలని రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నర్సింహ నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు నూజివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్, ముసునూరు మండల వ్యవసాయాధికారి సిహెచ్.శ్రీనివాసరావుతో కలిసి మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కౌలు రైతుకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. డిఎన్ఎ టెస్టులు చేయాలా, జన్యుపరమైన లోపాలున్నాయా, లేదా అనే విషయంపై శాస్త్రవేత్త బృందం వచ్చిన తరువాత పరిశీలించి జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు రైతుకు ఎంత నష్ట పరిహారం ఇవ్వాలనేది తెలియజేస్తామని చెప్పారు. రైతులు కూడా వ్యవసాయ శాఖ సూచనలు, సలహాలు పాటించి విత్తనాలు నాటాలని సూచించారు.

గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం : డిఎన్ఆర్

ప్రజాశక్తి - కైకలూరు

గ్రామ ఉమ్మడి అవసరాలు తీర్చుకోవడంలో గ్రామస్తులంతా ఐక్యతగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆటపాకలో గ్రామాభివృద్ధి కోసం సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి అవసరాలు తీర్చడానికి మంచినీటి చెరువు తవ్వేందుకు 15 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయిస్తున్నట్లు ప్రకటించారు. గ్రామస్తులు విరాళాలు సేకరించి ఆ మొత్తంతో కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. హాలుపై వచ్చిన ఆదాయం గ్రామంలోని శ్రీ రామాలయం అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. తొలుత గ్రామంలోని శ్రీకనకలింగేశ్వరస్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుగ్గిలపు పెదకాపు, కన్నా ముసలయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు పంజా రామారావు, ఉపసర్పంచి బావిశెట్టి పాము, ఎంపిటిసి సభ్యులు పట్టపు బాలమ్మ, నాయకులు తలారి జాన్, కన్నా రమేష్, సింగంశెట్టి రాము, సాంబయ్య, బుజ్జి, సుబ్బారావు, చిల్ల పెద్దిరాజు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కోసం ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

వైఎస్ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు సోమవారం తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహాశీల్దార్ కృష్ణజ్యోతి, నగరపంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 2006లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో 200 కుటుంబలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అప్పటి నుంచి దాదాపు 16 సంవత్సరాలు అయినా కాలనీలో కనీస వసతి సౌకర్యాలు కల్పించలేదన్నారు. కనీసం వీధిలైట్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేవని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ కాలనీ రోడ్డు ఆక్రమణకు గురైందని, తమ రోడ్డు తమకు అప్పగించాలని కోరారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఇళ్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేష్, నాగేశ్వరరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన కామర్స్ డిపార్ట్‌మెంట్ వారిచే సోమవారం ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ ఫైనల్ ఇయర్ బికామ్ విద్యార్థులు పవన్ హోండా మోటార్స్‌ను సందర్శించారు. ఆర్థిక పరమైన విధానాలకు సంబంధించి అద్దె కొనుగోలు విధానం, తక్షణ చెల్లింపు, వాయిదాలు, వడ్డీ శాతం తదితర వాటి గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి డాక్టర్ కె.ఉత్తమ్‌సాగర్, అధ్యాపకులు సిహెచ్.రమాదేవి, కెవివి.శిరీష పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి సంక్షేమ పథకం జగన్ ఇచ్చిన వరమేనని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని ఎల్లాపురం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. గ్రామంలో సమస్యల పరిష్కా రానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జలగం శేషగిరిరావు, వైసిపి మండల అధ్య క్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు వరి కూటి ప్రతాప్, ఎంపిపి కృష్ణకుమారి సుబ్బారావు పాల్గొన్నారు.

1న డిగ్రీ కాలేజీలో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో వచ్చే నెల ఒకటో తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి సోమవారం తెలిపారు. ఈ ఉద్యోగమేళాలో అపోలో ఫార్మసిస్ట్ క్యాంపెయిన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంస్థలో రిటైల్ ట్రెయినీ అసోసియేట్, ఫార్మసిస్ట్ పోస్టులకు 28 సంవత్సరాలలోపు వయసు ఉండాలన్నారు. 2017 నుంచి 2022లో ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణత అయిన అభ్యర్థులకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు హాజరు కావాలని చెప్పారు. వివరాలకు 9866215054 సంప్రదించాలని తెలిపారు.

నూజివీడు మామిడిని రక్షించాలి

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు మామిడిని ప్రభుత్వం రక్షించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మామిడి సాగు నూజివీడు ప్రాంతంలో నానాటికి అంతరించిపోతుందన్నారు. ప్రభుత్వం సరైన ప్రోత్సాహం అందించకపోవడమే ఇందుకు కారణమన్నారు. రైతులకు అవసరమైన పురుగుమందుల సరఫరా రాయితీపై అందించాలన్నారు. పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

ఆర్థిక కార్యకలాపాలు, బ్యాంకింగ్ సర్వీసెస్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్రం, వాణిజ్య శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఆర్థిక కార్యకలాపాలు బ్యాంకింగ్ సర్వీసెస్ అంశంపై అతిథి ఉపన్యాసం సోమవారం నిర్వహించారు. చేబ్రోలు కో-ఆపరేటివ్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్ యెలిశెట్టి పాపారావు బాబ్జి ప్రసంగించారు. దేశ ఆర్థిక కార్యకలాపాలన్నీ బ్యాంకింగ్ వ్యవస్థతో ముడిపడి ఉన్నాయని, వాటి నిర్వహణ తీరు, డిపాజిట్లు, సేవింగ్స్, వడ్డీ రేట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఆర్థిక శాస్త్ర విభాగ అధ్యక్షులు నిర్మలా జ్యోతి, కామర్స్ విభాగానికి చెందిన పి.పార్వతి ఈ కార్యక్రమంలో ప్రసంగించారు.

మెస్ ఛార్జీలు పెంచాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు

పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజనం కార్మికుల మెస్ ఛార్జీలు పెంచాలని ఎఐటియుసి నాయకులు సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందించారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సబ్ కలెక్టర్ ఎఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) జిల్లా అధ్యక్షులు చాట్ల పుల్లారావు మాట్లాడుతూ చాలీచాలని మెస్ ఛార్జీలతో ఏజెన్సీల ను నడపలేక పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ కార్మికులు తాహిరున్నిసా, సుబ్బమ్మ, వెంకటేశ్వరమ్మ, అంజమ్మ, సుల్తానా, అబీద, అఫ్రిన్, నాశ్రీనా, మరియమ్మ, లక్ష్మి, రాణి, శోభాలక్ష్మి, నాగలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో సరిపల్లి గ్రామంలో ఉన్న ఇండియన్ డిజిటల్ స్కూలులో మంగళవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరెక్టర్ జి.వరప్రసాద్ తెలిపారు. స్కూలులో నిర్వహించే సైన్స్ ఫెయిర్ లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు. విద్యార్థులు టీ షర్టు, తెలుపు యూనిఫారంతో స్కూల్‌కి రావాలని సూచించారు.

'15న అమరావతి ముట్టడి'

ప్రజాశక్తి - చాట్రాయి

ఎస్‌సి వర్గీకరణ చేయాలని కోరుతూ వచ్చే నెల 15వ తేదీన అమరావతి ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు యంద్రాతి కోటేశ్వరరావు మాదిగ తెలిపారు. మండల ఎంఆర్‌పిఎస్, అనుబంధ పార్టీ, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులతో చాట్రాయిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో రాష్ట్రంలో పాదయాత్ర చేపడతామని, మార్చి 15వ తేదీన రాష్ట్ర రాజధాని ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

ఆళ్ల నానిని కలిసిన మధు

టి.నరసాపురం :తాను రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన సందర్భంగా ఎంఎల్ఎ ఆళ్ల నానిని సోమవారం ఏలూరులో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్లు వాసిరెడ్డి మధు తెలిపారు. వచ్చే నెల పదో తేదీ నాటికి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి జిల్లా కమిటీలను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారని తెలిపారు.

నేడు గృహ సారధులకు, వాలంటీర్లకు సమావేశం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు గృహ సారధులకు, గ్రామ వాలంటీర్లకు స్థానిక కమ్మ కళ్యాణ మండపంలో ఈ నెల 28న సమావేశం ఏర్పాటు చేయనున్నారు. బొమ్మిడి, బాదంపూడి, కాగుపాడు, కాకర్లమూడి, నాచుగుంట, నీలాద్రిపురం, రావులపర్రు, ఉంగుటూరు, ఉప్పాకపాడు గ్రామాల సారథులు హాజరు కావాలని మండల సచివాలయ కన్వీనర్, ఉంగుటూరు-1 ఎంపిటిసి సభ్యులు పి.బాలకృష్ణ కోరారు.

అనారోగ్య బాధితునికి సాయం

చింతలపూడి :ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటమే నిజమైన మానవత్వం అని జనసేన పార్టీ మండల అధ్యక్షులు చీదారాల మధుబాబు అన్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న ఉప్పులూరి ఆనందరావుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాఘవాపురం జనసైనికులు మధు ఆర్థిక సహకారంతో రూ.ఐదు వేలు అందించారు. ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి తరువాత ట్రీట్‌మెంట్‌కి సహాయం అందిస్తామని చెప్పారు.